# ధర్మసాధని

[బ్రాహ్మసాధనాశ్రమ పక్షమున ప్రతిశనివారము ప్రకటింపబడును.]

ధర్మంచర । ధర్మాత్ పరం నాస్తి । ధర్మః సర్వేషాం భూతానాం మధు.

సంపుటము ౧. కాకినాడ:—శనివారము, ౨౧, మే, ౧౯౨౧. చందా సం॥ రు. ౩

సంచిక ౨౧. విడిసంచిక అ ౧.

## ఓమ్.

కరుణానిధీ! నిన్నెట్లు కారుణ్యభిక్షకై వేడుదును? ఏమి యోగ్యతలు నాయొద్ద గలవు? ఏమి త్యాగముల నే గావించితిని. నీ ప్రీతిని సంపాదించుటకై నేనేమి కష్టముల ననుభవించితిని? కుడిచి కూరుచుండి అనుగ్రహము చూపుమని నిన్ను ఏమొగము పెట్టుకొని అడుగుదును? అవ్యాజానుగ్రహము నీవు చూపిన చూపెదవు గాక! నోరెత్తి నే నేవిధమున నిన్ను ప్రార్థింతును? నీ కృపాపాత్రుడ నగు తెరువు చూపుము. తగిన అర్హతను ప్రసాదింపుము. త్యాగశీలతను దయచేయుము. నీపై ప్రేమచే సుఖాపేక్షను వదలి సేవించెడు బుద్ధిని దయచేయుము. నీ యిష్టానుగుణములైన కార్యముల గావించి నీ దయకు నర్హుడ నయ్యెద గాక!

---

భక్తుని జీవనము గౌరవాన్వితమైనది. కుమారా! నీ సామీప్యమునకు వచ్చినప్పుడు జనులు గౌరవబుద్ధిని కల్గియుండవలెను. దుర్మార్గులు భయకంపితులు గావలెను. ఈశ్వరబలము నీయందు గలదని వారిని గ్రహింప నిమ్ము. దైవ బలము మన్నింప దగినది. భయపడ ద నది అడంకువయు నీచత్వము గాదు. అడగువ గలవాడు నక్క వినయముల జూపడు. బట్టువలె [illegible]డడు. దొంగయేడ్పులు ఏడ్వడు. అన్యాయమును అక్రమమును తీక్షణముగా ఖండించుట నమ్రత విరుద్ధముగాదు. సర్వదా భక్తి మృదువుగాను మధురముగా నుండును. కొన్ని వేళల అయ్యాది కఠినముగను భయంకరముగను, నిర్దాక్షిణ్యముగను నుండును. ధర్మ విరోధులను దైవ విరోధులను భక్తుడు ఒక్కొక్కప్పుడు తీవ్రముగా నిందించును. అధర్మ ఖండనమును నిర్మల శాంతియు భక్తునియందు సామంజస్యమును జెందును. (అనువాదితము)

---

మన దృష్టిని భావమును విశాలపరచి చూచినచో విశ్వమెల్ల నొక మహా విజ్ఞానమును, అనంత తేజోరాశిని, అజేయశక్తిని ఆశ్రయించికొని నటుల గానగును. ఆవిజ్ఞాన తేజోశక్తుల సముపాలనము గావించుచు జీవుల దూషణ భూషణ తిరస్కారముల కింతయైన వెనుకాడక లోకసంరక్షణ జేయుచుండ గాంచెదము. ఆ విజ్ఞానపుటంశము, ఆ తేజఃకణము, ఆశక్తిబీజము మానవునందును గలదు. కాని మానవుడు నిజభోగతృష్ణకై వానిని నశింపజేసికొని సంఘ వినాశమునకు తోడ్పడుచున్నాడు. మానవుని స్వోత్కర్షత స్వార్థపరత్వములె మహా సంగ్రామములకు కారణములు. సంపూర్ణ త్యాగికి యుద్ధములతో పనియేలేదు. ఒక్కొకప్పుడు తాత్కాలికముగ వినాశకరముగ గనబడు నా త్యాగిమార్గములు సకాలమున లోక కల్యాణమునకు తోడ్పడ గల్గుట గాంచనగును. ప్రేమముపై నాధారపడి చేయబడిన యన్ని కార్యములును ప్రేమనే జనింప జేయునగును గాని నిజముగ వినాశమును గలిగింప నేరవు.

(జ్ఞానకుసుమము. దళము ౭)

---

# భారతజాతీయత.

—:o:—

[ శ్రీ రవీంద్రనాధ ఠాకూరు గారు. ]

## VIII.

మన అలవాటులలో గల అమితత్వము యొక్క ఫలితములు, మనకు బాగా పౌరుషమున్నంత కాలము మనకు కనిపింపవు. క్రమక్రమముగా ఆ అమితత్వము మనలో నుండు పౌరుషమును హరించివేయును. తుదకు వినాశమగు కాలము సమీపించుటతోడనే మనము అప్పు ఆస్తులను చెప్పివేసి, దివాళా తీయవలసినదే. ప్రతి నిమిషమునందు ప్రతిష్ఠాపన నిర్వహణ శక్తి వలన పాశ్చాత్య దేశములందలి మానవ సకశస్వభావము నశించిపోవుచున్నను, ఇంకను పాశ్చాత్య దేశములు తల యెత్తుకొనియే తిరుగగలుగుచున్నవి. హిందూదేశము కూడ తన యౌవనావస్థయందు ఈ సాంఘిక దురాచారములను మృత కళేబరములను, తన బలమైన బాహువులతో మోయగలిగినది. కాని యీబరువును మోయగా మోయగా బండబారి తుదకు స్పర్శజ్ఞానమును సహితమును గోల్పోయి పక్షవాత రోగమునందు పడిపోయినది. ఈ కారణము వలననే హిందూదేశము నందలి విద్యాధికులు తమ సాంఘిక లోపములను గాని, అవసరములను గాని, గుర్తించు శక్తిని గోల్పోయిరి. మన సంఘ కట్టుబాట్లలో గల అచంచల స్వభావమును చూచి, వానియందు యే లోటుపాట్లును లేకపోవుట వలననే, ఆవిధముగా చలనము లేకయున్నవని అనుకొనుచున్నారు. మన సంఘ ప్రతిష్ఠాపనములలో ప్రాణమున్నదనుటకు తీక్ష్ణమైన బాధ లేకపోవుటను జూచి దానికి జబ్బే లేదనియు, మందు అక్కరయే లేదనియు తలచి మహా మోసములో పడిపోవుచున్నారు. కనుక తమ బుద్ధి శక్తులన్నియు ఒక్క రాజకీయ విషయములకు మాత్రమే అవసరములని తలచుచున్నారు. ఒక మనుష్యుని యొక్క కాళ్లు కీళ్లరోగముచే పడిపోయి యెందునకును పనికిరాకపోయినప్పుడు, తన కాళ్లు పొందదగినంత బలమును పొందుటవలననే ఆ విధమున నిలిచియున్నవనియు, వచ్చిన లోటంతయు తగిన చేతికర్రలు లేకపోవుటయే యనిన, ఆత డెట్టి భ్రమకు లోనయ్యెనని చెప్పుదుమో, ఆభ్రమయే మనవారి నాశ్రయించి యున్నది.

సాంఘిక రాజకీయ పునరుద్ధారణము గూర్చి యిక చాలించి పరిశ్రమలను గూర్చి కొంచెము యోచింతము. బ్రిటిషు ప్రభుత్వము దేశము నాక్రమించిన తరువాత హిందూదేశమున నేమయిన పరిశ్రమాభివృద్ధి జరిగినదా యని చాలమంది నన్ను ప్రశ్నించుచుందురు. ఆంగ్లేయ ప్రభుత్వము యొక్క ప్రారంభదినములలో హిందూదేశపు చేతిపనులన్నియు నాశనము గావింపబడిన వనియు వాటినుండి నేటి వరకును ప్రపంచము యొక్క వ్యాపార మహాపోటీని యెదుర్కొన గలిగిన స్థితి మనకు కలుగుటకై, ఏవిధమైన సహాయమును, ప్రోత్సాహమును మనకు కలుగనే కలుగలేదను సంగతిని మాత్రము మనము జ్ఞాపకమునం దుంచుకొనవలసి యున్నది. మనము ఆయుధముల యొక్క ప్రయోగములను సహితము మరచి ప్రపంచ మున్నంత కాలమును వ్యవసాయదారులుగనే యుండవలెనని యీపాశ్చాత్య జాతులు మనకు విధించినవి. ఈవిధముగా, యే దినమున నైనను, యే అనాగరిక జాతివలన నైనను, ఆహారముగా కబళించివేయదగిన తునుక తునుకలుగా భారత దేశము భాగింపబడి పోయినది.

తన పరిశ్రామిక కల్పనాశక్తి బహిర్గతము కాగలుగు మార్గములు హిందూదేశమునకు బహు స్వల్పముగా గలవు. ప్రస్తుత కాలమున పరిశ్రామిక సంబంధమగు గొప్ప యంత్రశాలలవంటి మహా ప్రతిష్ఠాపనములలో నాకంత విశ్వాసము లేదు. వానిలో నుండెడు సౌందర్యరాహిత్యమే అవి ప్రకృతికి విరుద్ధముగా నున్నవని కనబరచుచున్నది. ప్రకృతి యొక్క మహాశక్తులన్నియు సౌందర్యము నందు తమ సత్యము కనపరచుచున్నవే గాని అందవికారమునందు కనబరచుట లేదు. మహా సృష్టికర్తయగు పరమేశ్వరుడు తన వస్తువులతో నెప్పుడు తాను సంతుష్టి చెందునో అప్పుడు సౌందర్యము తన చేవ్రాలును దానిపై లిఖించివేయును.

పూర్ణమైన అభివృద్ధిని పొందించుటకు, సాధనములైన మార్గముల నుపేక్ష చేసి, తమ వికార స్వరూపమునకు సిగ్గుచెందక ఉండు సమస్త వస్తువులును పరమేశ్వరుని యొక్క మిక్కుటమైన అసంతుష్టికి గురియగును. ఎంతవరకు మీ వర్తక వ్యవహారములలో నాజూకు, సౌమ్యత, లోపించునో అంతవరకవి సత్యపద్ధతులనుటకు వీలులేదు.

త. న. శ.

---

# కేనోపనిషత్తు.

—:o:—

[ శ్రీ ఆదిపూడి సోమనాధరావు గారు. ]

ద్వితీయ ఖండము.

గీ. బ్రహ్మమును గంటి నిందు దేవతలయందు
ననుచుఁ జెప్పుట యొక గొప్ప యగునె వత్స
యనుచుఁ బలికెను గురుని వాక్యార్థ మెల్ల
నేకతంబుగఁ జింతించి యెఱుఁగు వాఁడొ
బ్రహ్మము నెఱింగితి నటంచుఁ బలుకఁ గలఁడు. ౧

గీ. ఏను బ్రహ్మమ్ము నెఱిఁగియు నెఱుఁగ ననుచు
ననెను గురువర్యు వాక్యార్థమును నెఱుంగు
బ్రహ్మచారికె నిజముగా భవమైన
విమల బ్రహ్మ స్వరూపమ్ము వేద్య మగును.

గీ. తెలియ దని బ్రహ్మవేత్త దాఁ బలుకుచుండు
పలుకు లెంతయు సత్యమై వఱలుచుండుఁ

దెలియదను వాఁడె బ్రహ్మముఁ దెలియుచుండుఁ
దెలియు నను వాఁడె బ్రహ్మముఁ దెలియకుండు.

గీ. బ్రహ్మమును నాత్మలోఁ జూచు బ్రహ్మవేత్త
యక్షయంబగు మోక్షంబు ననుభవించు
బ్రహ్మ సంబంధమున నాత్మ బలముఁ గాంచు
నాత్మ విజ్ఞానమున మోక్ష మనుభవించు. ౮

గీ. ఇచట నాత్మ స్వరూపమ్ము నెఱుఁగఁ జేరి
సత్యముగ నాశమొందు సంశయము లేదు
గాన భూతంబులం దెల్లఁ గ్రాలుచుండు
నద్వితీయైక బ్రహ్మమ్ము నాత్మఁ గాంచి
ధీరు లిహలోక యాత్రను దీర్చి యవల
మోక్ష సామ్రాజ్య పదవిని బొందఁ గలరు. ౯

ఇది ద్వితీయ ఖండము.
సమాప్తము.

---

తృతీయ ఖండము.

గీ. ఆ పరబ్రహ్మ మహిమచే నమరు లెల్ల
నసురతతుల జయించి మహాహవమున
నా పరబ్రహ్మ మహిమను నాత్మ మఱచి
కాంచిన జయంబు తమదని గర్వపడిరి. ౧

గీ. అంతయు నెఱింగి బ్రహ్మ మా యమరులకును
దెలివి మాలిన గర్వముఁ దొలఁపఁ దలఁచి
యక్షముగఁ బొడగట్టిన నట్టి చూచి
యేదియీ భూత మిది యని యెంచి సురలు. ౨

గీ. పూజ్యమై యొప్పుచుండు నీ భూత మెదియొ
యరసి రమ్మని పంపిరి యగ్ని హోత్రు
వడిగఁ బరుగెత్తుకొని వచ్చు వహ్నిఁ జూచి
యక్ష మెలుఁగెత్తి నీ వెవ్వఁ డనుచు నడిగె. ౩

గీ. జాతవేదాఖ్యచేత విఖ్యాతుఁడైన
యగ్ని నే నని గర్వించి యనలుఁ డనియె
నయిన నీ బల మెంతని యక్ష మనుగ
నవని నన్నింటి దహియింతు ననియె నగ్ని. ౪

గీ. అప్పు డొక గడ్డి పోచను నగ్ని ముందు
యక్ష మిడి దీనిఁ గాల్పు మంచనిన నగ్ని
కసుఁ గడంగియు గడ్డిని గాల్ప లేక
గర్వమును వీడి వేష్పాలు కడకు మరలి
యక్షము నెఱుఁగఁ జాలనైతి మటంచుఁ బలికె. ౫

గీ. పూజ్యమై యొప్పుచుండు నీ భూత మెదియొ
యరసి రమ్మని వాయువు నంపి రంత
నొక్క పరుగున వచ్చు వాయువును జూచి
యక్ష మెలుఁగెత్తి నీ వెవ్వఁ డనుచు నడిగె. ౬

గీ మాతరిశ్వాఖ్యచేత విఖ్యాతుఁడైన
వాయు వే నని గర్వించి పలికె గాలి;
యయిన నీ బల మెంతని యక్ష మనుగ
నన్నిటిని బట్టి కదలింతు ననియె గాలి. ౭

గీ. అప్పు డొక గడ్డి పోచను ననిలు ముందు
యక్ష మిడి దీనిఁ గదలింపు మనిన గాలి
కసుఁ గడంగియు గడ్డిని గదప లేక
గర్వమును వీడి వేష్పాలు కడకు మరలి
యక్షము నెఱుఁగఁ జాలనం చనియె గాలి. ౮

గీ పూజ్యమై యొప్పుచుండు నీ భూత మెదియొ
యరసి రమ్మని యింద్రునిఁ బంప నతఁడు
వడిగ బరువెత్తుకొని యట వచ్చి చూడ
దృష్టికా యక్ష మట్టె యదృశ్యమయ్యె. ౯

గీ ఆ గగనమందె యపుడే యమర పతియుఁ
గాంతిచేఁ గ్రాలు నా హిమవంతసుతను
నుమను దర్శించి కరకమలముల మోడ్చి
యక్ష మిది యేమొ ? సెలవియ్య మనుచు వేఁడె.

ఇది తృతీయ ఖండము.
సమాప్తము.


---

చుట్టలు త్రాగుట:—

బాలురలో చుట్టలు త్రాగెడు నభ్యాసములు మాన్పింపవలెనను తీర్మాన మొకటి మదరాసు శాసన సభలో ప్రతిపాదింపబడెను. సింహళ ద్వీపము నందును, పంజాబు, మైసూరు, కొత్తివాడు, భావనగరు, బరోడా సంస్థానముల లోను బాలురు చుట్టలు త్రాగ గూడదను చట్టము ఆమలులో నున్నది,

(పత్రిక.)

---




శనివారము, ౨౧, మే, ౧౯౨౧.

## "పిగ్మీ"

—:§:—

"పిగ్మీ" అనునది యింగ్లీషు మాట. పొట్టివాడు, మఱుగుజ్జు అని దానికి అర్థము. కబీర్, నానక్, చైతన్య మున్నగు ఆంగ్లవిద్య బడయని ప్రాచీన భక్తులముందర రామమోహనుడు పిగ్మీయని గాంధిమహాత్ముడు ఇటీవల నొక సందర్భమున నుడివెను. అట్లు వచించుట సరిగాదని సి. ఫ్. ఆండ్రూసు మొదలగు రామమోహనుని యభిమానులు పత్రికలకు వ్రాయుచున్నారు.

ఈ సంవత్సరము ఫిబ్రవరి ౧౦ వ తేది సంచికయందు 'బ్రాహ్మసమాజ స్థాపకు లెవరు?' అను శీర్షిక క్రింద రామమోహనుని గూర్చి యీ క్రింది విధమున వ్రాసితిమి.

"రామమోహనుడు శిష్టాచార సంపన్నుల గృహమున జనించెను; హిందూధర్మ గ్రంథములు కూలంకషముగ పఠించెను; అన్యమత గ్రంథములను చదివెను. అతడు నేర్చిన భాషలలో ఆంగ్లమును కలదు. కాని అతని పాండిత్యము విద్యాలయములందు గ్రహింపబడినది గాదు. ఇతరుల తోడ్పాటుతో స్వయంకృషి మూలముననె అతడు మహా విద్వాంసుడయ్యెను. అతడు ఋషి; అద్భుతశక్తి సంపన్నుడు. అతని దృష్టి అతి సూక్ష్మము. బాల్యముననె ఏకేశ్వరోపాసనా ప్రభావము గ్రహించెను. వివిధమత పరిశీలనముచే మతము విశ్వజనీనమని గుర్తించెను. సాంఘిక రాజకీయ సంస్కరణములకై పోరాడినను స్వజాతీయ ప్రకృతికిని తన జీవనమునకును మూలమై ఐహికాముష్మిక సుఖములకు సాధనమై యున్న బ్రహ్మోపాసనమునె బ్రాహ్మసమాజోద్దేశ్యముగ జేసెను. ఉపాసనా ప్రణాళికి జాతీయాకారమునె యొసంగెను. హిందువులు తిరిగి యెప్పుడు సర్వ స్వాతంత్ర్యములు గలిగి ప్రపంచమున తలయెత్తుదురా యని వాంఛించెను. అట్టి రామమోహనుడు ఆంగ్లమానస పుత్రుడును, అతడు స్థాపించిన బ్రాహ్మసమాజము విజాతీయమును అగునా?"

గాంధి మహాత్ముని వచనములు ద్వేషము వలన వెలువడినవి కావని మా గట్టి నమ్మకము. ఒక్క రామమోహమునకె గాక తిలకునకు కూడ వారు పిగ్మీ అను పదము వాడిరి. మఱియు తిలకు, రామమోహనుల యెడ తమకు గౌరవము గలదనియు నుడివిరి. కాని వా రుభయులు ఆంగ్లవిద్యా వాసన సోకిన వారలగుటచే పూర్వకాలపు భక్తుల యెదుట చాల యల్పులని వారు తెలిపిరి. ఆంగ్లవిద్యవలన బానిస ప్రకృతి మన విద్యార్థులలో ప్రబలినదని మహాత్మ గాంధిగారి దృఢవిశ్వాసము. ఆంగ్ల విద్యాదోషము వలననె వారిరువురకు శంకరాదులకు గల జనవశీకరణ శక్తి కలుగలేదని వారు తలంచుచున్నారు. రామమోహనుని యెడల వారికి ప్రత్యేకముగ నెట్టి యసూయత లేదనుట స్పష్టము. కాన వారి మాటలు ఎక్కువ యాదరణతో పరిశీలింప దగినవని మేము తలంచుచున్నారము. మా బ్రాహ్మసమాజ సోదరులు చూపు తీవ్రత మాకు బోధపడుట లేదు. గాంధిమహాత్ముడు తన యభిప్రాయము నెంతయు గౌరవముతో తెలిపెను ఒకరు భిన్నాభిప్రాయము తెలిపి రన్న కారణమున వారిని తూలనాడుట వ్యక్తి స్వాతంత్ర్య ప్రియులగు బ్రాహ్మసమాజికుల కెంతమాత్రము తగదు.

మహాత్మ గాంధిగారి వాక్కులను మేము శ్రద్ధతో పఠించినాము. వానియందు సత్యమేమైన గలదేమొ యని పర్యాలోచన సలిపినారము. కాని మేము వెనుక తెలిపిన యభిప్రాయము అంతకంతకు దృఢపడెనే గాని చలింప లేదు. అసలు రామమోహనుడు దొరతనము వారు ఏర్పరచిన విద్యా విధానము నుండి తయారయిన విద్యార్థుడు కానె కాదు. ఈ విషయము గమనింప బడినచో, వివాదములో ముప్పాతిక తీరి పోవును. రామమోహనుడు ఆంగ్లము నభ్యసించెను కావున, అతనికి దోషము కలిగినట్లె యని కొందర నుకొన వచ్చును. మహాత్మ గాంధిగారు ఆంగ్లము నెవ్వరును చదువ గూడదని చెప్పుట లేదు. ఆంగ్లము నేర్చుట యావశ్యకమె యని

రామమోహన తిలకులను పిన్నలని తెలిపిన సమయమునను అంగీకరించిరి. రామమోహనుడు ఆంగ్లమును దేశమున ప్రవేశపెట్టుడని దొరతనము వారిని కోరెను; కాని పరిష్కృత విధానము ననుసరించి విద్య గఱపుడని చెప్పియుండలేదు. ఆంగ్లభాషా ద్వారముననె బాల్యమునుండియు మన దేశస్థులు విద్యను గ్రోలవలెనని రామమోహనుని యభిప్రాయమై యుండునని మేము తలంపజాలము. దేశభాషయందసామాన్య అభిమానము గలిగి దానిని జ్ఞాన వ్యాపనమునకు సాధనముగా వినియోగించిన రామమోహనుడు ఇప్పటి విద్యాపద్ధతిని ఎంతమాత్రము అంగీకరింపడనియె యూహింపనగును. ఆతని యనంతరము వెలసిన విద్యా విధానమునకాతడెట్లు ఉత్తరవాది యగును? దానిని విమర్శించి సంస్కరించుట ఆతని తరువాతి వారి బాధ్యత. వంగదేశ విభజనమొ, పంజాబు వధో, ఇంక నేదో దొరతనము వారు గావించు అక్రమముచే నుద్రేకము జెంది జను లొకింత పరిష్కృత విద్యా విధానమును నిరసించి యేవో పాఠశాలలు స్థాపించినంత మాత్రమున, రవీంద్రుడు ఒకప్పుడు మా పురసుందరమున వెలిబుచ్చినటుల, జాతీయ విద్యాంకురము దేశమున బయల్వెడలెనని తలంచుటకె వీలులేదు. రవీంద్రుడు, లాలా మున్షిరామ్ (శ్రద్ధానంద), పండిత కార్వె విద్యావిధాన సంస్కరణమునకై విద్యాలయముల నెలకొల్పి, యే తాత్కాలికావేశముననో గాక తమకు తోచిన జాతీయ విద్యాదర్శమును లక్ష్యమునం దుంచుకొని పాటుపడుచున్నారు. ఇట్టి మహనీయుల సంఖ్య వృద్ధి యయిననె గాని జాతీయవిద్య నిజముగ వ్యాపనమునకు వచ్చునని తలంచుటకు వలను పడదు.

పాశ్చాత్య సంఘర్షణమున క్రైస్తవ ధర్మమునకు స్వాగతం బొసంగి హిందూధర్మమును విపుల పరచి ధర్మము యొక్క విశ్వజనీనతను ప్రకటించిన నవయుగ ప్రవక్త రామమోహనుడు. సర్వమత సామరస్యమునకు ఆతడు స్థిరముగ పునాదిని వేసెను. ఆతడనుసరించిన సంస్కరణ విధానము జాతీయము. ప్రతి మతకర్తకును సమకాలికుల నుండి నిరోధ కలుగక తప్పదు. రామమోహనుని కాలమున రామమోహనుని అనుసరించిన వారి సంఖ్య స్వల్పమై యుండుటచే ఆతడు గొప్పవాడు కాక పోడు. మరణాంతరమె మహనీయుల [illegible]క్యత బాగుగ గుర్తింపబడును. రామమోహనుని విషయమునను అట్లె తటస్థించుచున్నది. భారతవర్ష పితామహుడని, భారతజాతి నిర్మాత యని, యుగపురుషుడని నేడు రామమోహనుడు కీర్తింపబడుచున్నాడు. రామమోహనుడు ధర్మపీఠము వహించిన పిమ్మట ఎట్టి యున్నతశక్తిని ప్రదర్శింప గలిగెనో యించుక దెలిపెదము. లౌకికాధికారము ముందర ధర్మము దోసిలియొగ్గుట విరుద్ధము; మన దేశ సాంప్రదాయమును గాదు. మన దేశమున రారాజులు సహితము భక్తుని నమస్కరించి ఆశ్రయింప వలసినదె. మన దేశీయులు ధర్మమున కంతె యుచ్చస్థాన మిచ్చిరి. లౌకిక జీవనమునందును రామమోహనుడు ఆత్మగౌరవమునకు భంగకరముగ జీవించలేదు. లౌకిక కార్యములన్నియు విడిచి ధర్మము కొరకె, దేశసేవ కొరకె తన జీవితము అర్పించిన తరువాత, అధికార సంబంధముగా విలియమ్ బెంటింగు ప్రభువు (అప్పటి వైస్రాయి) తనను రమ్మని కబురు పంపినప్పుడు, నిరాకరించుచు రామమోహను డొసంగిన ప్రత్యుత్తరము ఆతని యాత్మబలమును తెలుపును. అట్టి యాత్మీయ శక్తి మన దేశీయులలో పెంపొందిననె గాని మన దేశము సాంఘికముగ గాని రాజకీయముగ గాని స్వాతంత్ర్యమును బడయజాలదు. మహాపురుషులను సరిపోల్చి వారికంటె వీరు, వీరికంటె వారు గొప్పయని చెప్పుట సమంజసము గాదని మేము తలంచుచున్నారము. భగవద్గీతలో చెప్పబడినట్లు ధర్మ సంస్థాపనమునకై యుగయుగమున నుద్భవిల్లు మహాపురుషులలో రామమోహను డొకడనుటకు మేము సందేహింపము.

---

హారతి:—

గత సంచికయందు ప్రచురింపబడిన హారతి గీతమును పంపుచు శ్రీ దుగ్గిరాల సూర్యప్రకాశ రావుగారు దానిని గూర్చి యీ క్రింది వాక్యములు వ్రాసిరి. స్థలము చాలక గత సంచికలో అవి ప్రచురింపజాలక పోతిమి.

“అమృత సరస్సు దేవాలయమునందు ప్రతి దినము సాయంకాలమునందు దలకనిరంజనునకు గ్రంధ సాహెబున కిచ్చు హారతియందైన దీపముల నుంచి యర్చకుడు హారతి గీతమును పాడును దానినే మిగత భక్తులును పాడుదురు. ఏక దైవోపాసకులకా గీతము కడు హృదయరంజకముగ నుండును గాన దానికి ఆదిపూడి సోమనాథరావుగారు తెనుగున చంపకమాల వృత్తమును రచించిరి.”

---

## ధైర్యము గల యౌవనుడు:—

మా పురమున మల్లాది సుబ్బారావు గారు అను అతి ధైర్యమును సాహసమును గల యౌవనుడు గలడు. ఇతరులు ప్రాణాపాయమున నుండుట గాంచిన, వారిని కాపాడుటకు వెనుకంజ వేయడు. అగ్నినుండి, జలమునుండి యిదివరకు కొందరను రక్షించుటచే పతకములు బడసెను. ఈనెల ౧౬ వ తేదిన రామకృష్ణయ్య చెరువులో ముగ్గురు పిల్లవాండ్రు పడి ప్రాణములు గోల్పోవుటకు సిద్ధముగ నుండిరి. అప్పుడు చెరువు ప్రక్కగా మల్లాది సుబ్బారావుగారు నడచిపోవుచుండి అది గాంచిరి. వెంటనె నీటిలో దుమికి మునిగిన ముగ్గురు బిడ్డలను పైకెత్తెను, ముగ్గురను బ్రతికిరి. ఆబిడ్డల తల్లిదండ్రుల సంతోషమునకు మేరయుండదు. వారిలో కాలేజి ఉపాధ్యాయుడు అత్తిలి సూర్యనారాయణగారి కుమారుడొకడు. సుబ్బారావుగారి ధైర్యసాహసములు ప్రశంసార్హములు.

## పత్రికలకు హెచ్చరిక:—

"తుచ్ఛమగు డబ్బును ఆశించి సారాయముల ప్రకటనల నింకను ప్రచురించుచున్న హైందవ పత్రికలయొక్క వర్తనము మాకు బోధపడుట లేదు; విచారము కలిగించుచున్నది." అని మాడరన్ రివ్యూ పత్రిక వ్రాయుచున్నది. సారాయముల ప్రకటనలను దేశీయ పత్రికలు వెంటనె మానుట సమంజసము.

# నిష్కామ తాపసి.

—:o:—

కాశీకానగర పరిసర గంగానది తటాంచల సైకత ప్రదేశమున సాంధ్యరాగంబు లీను సూర్యుని కర్మసాక్షిగా నెఱింగి భూమ్యాకాశ మధ్యరంగమున ననంతములైన మబ్బు తెరలమాటున దాగిన గగనచరులగు పవిత్ర స్వరూపముల వంక దృష్టి నిలిపి నిర్వాణ సామ్రాజ్య పట్టాభిషిక్తులైన ఋషిగణంబుల దలపోసి ఏ తేజమును బడయుటకై వారు వారి యౌవన తేజమును అడవిగాచిన వెన్నెల జేసినారో యే మహా స్వారాజ్యపదము గాంచుటకై ఆత్మరక్తము పారించినను లభించని స్వరాజ్యమును తృణప్రాయముగా పరిత్యజించినారో దేనికై రేయింబగళ్లు వానకై చాతకపక్షివలె పలవించినారో అట్టి పరమేశ్వరుడు తన్ననుసరించు గాత యని, ఈ సంసార సాగరము తరించుట కేది మార్గమనియు, శిరము నేలకు వంచి ఒక తాపసి దుఃఖాశ్రువులు కాలువలై పారు దీనభావముచే కిత్త యెలుగెత్తి ఓ పరమేశ్వరా! నీవున్నావు నేనెఱుంగుదును. నీవు లేనిచో నేను లేను. ఈ ప్రపంచమంతయు మున్నె లేదు. ఈ సలలిత సముజ్జ్వల సలిల సమన్విత గంగా పవిత్ర నదీ ప్రవాహమునకే వేగము ఈసాగను అసలే లేకపోవును.

ఉ. పాపము సేయునాఁడు తన పాపము వాపఁగఁ గోరుచుండు నిన్
దాపసియుండ సమాధి నిను ధ్యానము జేసి తరింపఁ జూచు నే
నే పనికిన్ బ్రయోజకుఁడ నించుక గాను మహానుభావ దే
వా పరమేశ సేవకుఁడనై పరిదేవన మాచరించెదన్.

లోకమునం దెందఱో మహాభక్తులున్నారు. వారు తమ అపార పారావార సమతుల్యమైన భక్తి సలిపి దాని ఫలితమును గోరుటకు వారికి స్వాతంత్ర్యమున్నది. వారు కోరినను నీ విచ్చుట కంగీకరింతువు. నే నందుకు గూడ పనికిరాను.

మ. సరముల్ తోయము పత్రముల్ వివిధపూజాద్రవ్యముల్ నీమహా
త్తర భాండారము లోన దొంగిలి భవత్సం కేమియున్ లేక నీ
దరికే దెచ్చి గడించినాననుచు మిథ్యల్ వల్కి నీ నుండి యా
పరమార్గంబు గడింపఁ జాలను మహా భ్రాంతుండనై యీశ్వరా.

చ. తపమును సల్పి దాని ఫలితం బిడ వేడగలేను నిన్ను నా
యపకృత దోషజాల పరిహారము సేయుఁదలంతు గాని నే
నపరిచితుండ నీ దయను యాచకుడన్ వణిజుండ గాను ఏ
నిపుణత లేదు కోరకయు నేరను నీ యదె భార మీశ్వరా.

కం. ఏ వస్తువు సేయుటకై
నీ వర్హుఁడ వటుల మమ్ము నేర్పరుపుము నే
నే వస్తు వగుదు నట్టుల
నీ వొనరింపంగ వలవ దీశ్వర వింటే.

శా. గోసిన, పాపముల్ దొలఁగ ద్రోసిన నీవె యటంచు నమ్మి పే
రాస శిరంబు వంచి భవదాజ్ఞకుఁ జేతులు మోడ్చియున్న యీ
దాసునిఁ జేఁదిసి చరితార్థుని సేయుము నన్ను గావఁగా
నీ సరివారు లేరు మఱి నీటనో పాలనో ముంచు మీశ్వరా.

ఇట్టి స్థితిలో తెల్లవారిపోయినది. రేయెల్ల నాల్గు జాములు వెన్నెల కాసిన నిశాచరుఁడు వెలవెల బోయెను. పక్షు లుషఃగానములు సేయుచున్నవి. ప్రభాతవాతములు హాయిగా నొడలు పులకరించునట్లు వీచుచున్నవి. కోయిల కెవ్వని కంఠము విప్పి పాడ నారంభించెను. మదనుఁడు కుసుమ మార్గణంబులు చెఱకు విల్లు నుండి యెక్కుడించి నిమీలిత లోచనుడై పాపము రాత్రి యంతయు పడిన శ్రమకై కునికిపాటులు పడుచు మాగన్ను వేయుచున్నాడు. విశ్వమానవ ప్రపంచము దీర్ఘనిద్ర ముద్రితులై పడి మరల తేజః ప్రపంచమార్గమున సొచ్చి విధ్యుక్త కార్యముల నెరవేర్చుటకు సంకల్ప రథంబుల పూన్చుచున్నారు. తాపసి వీనినెల్ల నవలోకించి తనలో ప్రసన్నమై ఈశ్వరునకు నమస్కరించి శృంగారావలోకన సముత్సుకములైన ప్రాపంచిక వాంఛల పరిత్యజించి జితేంద్రియుడై యసంప్రజ్ఞాత సమాధిని నిలిచి దిక్కులకు బారక కోరికల జీకు మాయల జోరక సంసార శత్రు మిత్ర కళత్రాదుల జెడక కేవల సదసద్వివేక సమన్వితుడై.

ఉత్సాహ. ఓ ప్రభాత శీతవాత! యో వినేత నీకిదే
నే ప్రణామ మాచరింతు నీవు దేవు జేరినన్
స్వప్రశక్తి మఱచి శోక జప్తియున్న మట్టునన్
నా ప్రసన్నమైన మ్రొక్కు నర్మిలిన్ వచింపుమా

ఉమర్ అలీషా.

**The Dharma Sadhani Press,**

COCANADA.

*All Kinds of Job work*
*in*
English & Telugu
*Promptly and Neatly*
*executed.*

## యోగము.

పరోక్షము: అపరోక్షము.

ధర్మజీవనమునకు తోడ్పడు ఉత్తమ గ్రంథరాజము.

భక్తాగ్రేసరులు.

బ్రహ్మానంద కేశవచంద్రునిచే

విరచితమగు

సుప్రసిద్ధ గ్రంథమునకు

ఆంధ్రీకృతము.

వెల **0-2-6.**

పోస్టుద్వారా పంపగోరువారు **0-3-6** పోస్టు బిళ్లలు ఈ క్రింది విలాసమునకు పంపవలెను.

ధర్మసాధనీ కార్యస్థానము,
కాకినాడ.

## కేసరి—పత్త్రత్రయము.

### లోధ్ర.

గర్భాశయ రోగనివారిణి.

స్త్రీలకు గలుగు ఋతుశూల, బహిష్టు కాకుండుట, అకాల బహిష్టి, మైల జాస్తిగాను, తక్కువగాను పోవుట, కుసుమరోగము, సంతానహీనత, రక్తహీనత, మలబద్ధకము, సూతికా రోగము, కీళ్ళనొప్పులు, అరకాళ్ళు, అరచేతులు మంట మొదలగు స్త్రీసమస్త వ్యాధులను కుదుర్చును. 24. ఔ రు. 5. 12 అవున్సుల బుడ్డి రు 3-0-0. 6 అవున్సుల బుడ్డి రు 1-10-0.

### అమృత.

రక్తశుద్ధి ద్రావకము.

ఇది రక్తహీనత, మలబద్ధకము, అజీర్ణము, కీళ్ళనొప్పులు, సోమరితనము, మేహవ్రణములు, సుఖసంకటములు, విస్ఫోటకము, కడుపుబ్బు మంట మొదలగు వ్యాధులను నివారించి శరీరమునకు కాంతి ముఖమునకు తేజస్సును యిచ్చును. 24. అవున్సులు రు [illegible] 12అవున్సులు బుడ్డి రు 3-0-0. 6 అవున్సుల బుడ్డి రు 1-10-0.

### అర్క.

సర్వజ్వర నివారిణి.

వాత, పిత్త, కఫ, విషము, సన్నిపాతకొండ, మన్యసమస్త జ్వరములు జ్వరబిళ్ళ విషపడిశ మహాశ్చర్యముగ కుదుర్చును. 6 అ రు 2-8-0; 3 అ రు 1-8-0; 1 అ 0-8-0.

కేసరికుటీరం, ఆయుర్వేద ఔషధశాల,
ఎగ్మోర్, మదరాసు.

## P. SUBBA ROY.

**Ayurvedic Pharmacy,**

*Sri Venkatesa Perumal koil Sannithy,*

TANJORE.

## పి. సుబ్బరాయి.

ఆయుర్వేద ఔషధశాల,

శ్రీవెంకటేశ పెరుమాళ్ళు సన్నిధి, తంజాపూరు.

అరగజా:—ఇది యింకొక విధమయిన పరిమళద్రవ్యము. ఇది ప్రత్యేకముగా గాని గంధముతోనైనను గాని వుపయోగించవచ్చును. ఇది దేహమునకు పూసుకొనవచ్చును, ముఖమున తిలకము వుంచుకొనవచ్చును. మంచి వుడుపులకు, వస్త్రములకు, చేతిగుడ్డలకు పూయవచ్చును. దీని వాసన చెప్పతీగదు, దీనియొక్క పరిమళము పూసుకొనిన వెనుక మూడు దినములవరకు ప్రతినిత్యము స్నానము చేసినను వదలక దేహమునందే వాసనయుండును. వెల డబ్బి 1 కి అ 8, 1 మొ 12 డబ్బీలవరకు వి. పి. శెలవు అ 8 ప్రత్యేకము.

అంబర్:—ఈ సుగంధ ద్రవ్యమును కొంచ మెత్తుకొని దుప్పటాలు, వుడుపులు మొదలగు వస్త్రములకు వేసినయెడల పరిమళము వుండుటయే గాక పురుగులు పుట్రలు చేరకయుండును. ముఖమునకు శరీరమునకు పూసికొనిన యెడల ముఖమునవచ్చెడు మొటిమెలు నల్లచుక్కలు దేహమున పొడలు మచ్చలు దురద మొదలైనది నివారించి ముఖమునకు తేజస్సును నిచ్చును, తమలపాకులో చరిమి తాంబూలముతో వుపయోగించినా మనోవుత్సాహము నిచ్చును. స్నానముచేయు వేడినీళ్లలో కలిపిన యెడల నీళ్లంతయు పన్నీరువలె సుగంధమైన వాసన గలిగి మనస్సును తృప్తిపరచి దేహశ్రమ నివారించును. వెల డబ్బి 1 కి అణాలు 8, 1 మొదలు 12 డబ్బీలవరకు వి. పి. శెలవు అణాలు 8 ప్రత్యేకము.

బొల్లికి మందు.

పైన పూయవలసినది. ఒక వారము వాడిన తప్పక గుణమిచ్చును. మంటయుండదు. మెల్లగా పనిచేయును. అన్ని తత్వములకు సరిపడును. ఒక సీసా ఖరీదు రు 2—0—0. 1 మొదలు 3 సీసాలవరకు వి పి, చార్జి 8 అణాలు అధికము. మావద్ద దొరకు ఆయుర్వేద ఔషధములయొక్క కేటలాగు కోరువారికి ఉచితముగా పంపబడును.

# అమృతాంజనము.

## సుందరమైన 1921 ఉపయోగమైన

## క్రొత్త క్యాలండరు

విక్రియమునకు సిద్ధముగనున్నది.

క్యాలండరు వెల 1 కి 0=4=0 వి. పి. ఖర్చులు సహా 0=6=0

వెంటనె వ్రాసుకొనవలయును.

| లోమర తైలము | పండ్లపొడి | మోహినీ తైలము |
| --- | --- | --- |
| డబ్బి 1 కి, 0=6=0 | డబ్బి 1 కి, 0=2=0 | సీసా 1 కి, 0=12=0 |

## అమృతాంజనము

అన్ని నొప్పులకు దివ్యామృతము.

దగ్గు, శైత్యము, పడిశము, రొమ్ము పడిశము, తలనొప్పి, వాయువు నొప్పు... ప్పోటు,

జెణుకులు, బిళ్లలు, మొదలగు నొప్పులకు దివ్యామృత...

చక్కని డబ్బితో సహా వెల రూ. C-10-0. డజను 1 కి రూ. 6-0-0 ... ఖర్చులు వేఱు.

## అమృతాంజనము డిపో,

౧౦౯, ఫేరిరోడ్డు, ఫోర్టు, బొంబాయి, ౬, తంబు శెట్టివీధి, మద...



శ్రీమాన్ వైద్యరత్న పండిత

డి. గోపాలాచార్లుగారు స్థాపించిన

## ఆయుర్వేదాశ్రమము.

41, ఆచారప్పన్ వీధి, జార్జిటవున్, మదరాసు.

ఇందు, మామూలురీతిగా మందులు విక్రయింపబడును.

ప్లేగు, కలరా, ఇన్‌ఫ్లుయెంజా మున్నగు వ్యాధులకును. తదితర వ్యాధులకును మందులు దొరకును.

వ్యాధివివరములను వ్రాసిన, మందులు నిర్ణయించి పంపబడును.

కోరువారికి క్యాటలాగు ఉచితము.

ఎన్. మాధవమీనన్ (ఆయుర్వేదాచార్య)

తంతి విలాసము ) డి. దేశికాచార్యులు,

'పండిట్', 'మదరాసు.' ) జాయింటు ప్రొప్రయిటర్లు.


## ధర్మసాధని.

ప్రకటన పద్ధతి.

| | 1 సం॥ | ½ సం॥ | ¼ సం॥ |
| --- | --- | --- | --- |
| 1 కాలము. | రు. 60 | రు. 40 | రు. 24 |
| ½ ,, | ,, 40 | ,, 24 | ,, 16 |
| ¼ ,, | ,, 24 | ,, 16 | ,, 12 |

ప్రకటన ద్రవ్యము ముందుగానె చెల్లింపవలెను.


**Reg. No. M. 1094.**

**The Dharma Sadhani, Cocanada.**

(Printed and Published by K. Hanumanta Rao, at the Dharma Sadhani Press, Cocanada.)


**V. P. *Rs.*** *As.* **To M. R. Ry.**




61 Jayanti Gaganna garu B. A, L. T.,
Head Master, V. H. School,